మంత్రి 'పొంగులేటి'ని కలిసిన బడంగ్‌పేట్ మేయర్



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు



ఎగ్జిబిషన్‌లో చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆకట్టుకుంటున్న ఎగ్జిబిషన్ అండ్ సేల్ మేళా

వనస్థలిపురం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఒపెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్ అండ్ సేల్ మేళా విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతా వర్క్స్ శారీస్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారీ శారీస్, బెంగాల్ కాటన్ శారీస్, డిజైనర్ శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌస్స్, లక్నో చికెన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి టాయ్స్ మరియు ఇతర అనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అక్బర్ అలీ మాట్లాడుతూ.. చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్త కళా ప్రదర్శనను ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలనీ కోరారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన చేనేత ఉత్పత్తులను తమ ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. అన్ని వర్గాల ప్రజలు కొనుగోలు చేసే విధంగా చేనేత ఉత్పత్తుల ధరలను అందుబాటులో ఉంచామనీ తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 10.30ల నుంచి రాత్రి 9గంటల వరకు అందుబాటులో ఉంటుందనీ అక్బర్ అలీ పెర్కొన్నారు.



ఈస్ట్‌జోన్ డీసీపీగా బదిలీపై వెలుతున్న ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీని శుక్రవారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ గాయత్రీనగర్ చౌరస్తాలోని స్థానిక ఉత్పత్తుల కేంద్రం(ఎల్‌పీడీఓ) నిర్వాహకుడు భరత్ సంఘం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు

ఘనంగా లూయి బ్రెయిలీ జయంతి

చాదర్‌ఘాట్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అంధ బాలుర పాఠశాల దారుషిఫాలో గురువారం రాత్రి జరిగిన లూయి బ్రెయిలీ జయంతి వేడుకలకు చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫీకర్‌అలీ, ఎమ్మెల్సీ రియాజుల్ హసన్ అఫెందీ విచ్చేశారు. అంధ విద్యార్థులకు ప్రభుత్వపరంగా అందాల్సిన వసతుల కల్పనకు తమ వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి, డిప్యూటీ డీఈవో ముక్రం, డిప్యూటీ ఐవోఎస్ హరినారాయణ, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అలివేలు మంగ, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందడి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీలలో మౌలిక సదుపాయాల కోసం కృషి

● కార్పొరేటర్ సుజాతనాయక్

చంపాపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని ఆయా కాలనీలలో మౌళిక వసతుల కల్పనల కోసం కృషి చేయనున్నట్లు కార్పొరేటర్ సుజాతనాయక్ అన్నారు. డివిజన్‌లోని సాయిప్రకాష్‌నగర్ కాలనీలో శుక్రవారం జీహెచ్ఎంసీ నిధులతో చేపట్టనున్న సీసీ రహదారి నిర్మాణ పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రాఘవేందర్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రనాయక్, రేణుకగౌడ్, కాలనీ ప్రతినిధులు ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులను చేపట్టండి


● కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆగిన డ్రైనేజీ పనులను మళ్లీ చేపట్టాలని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ జలమండలి అధికారులకు విన్నవించారు. శుక్రవారం ఆయన సత్యానగర్‌లో పర్యటించారు. పోచగుడి వద్ద ఆగిన డ్రైనేజీ పనులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆయన జలమండలి జీఎం బలరాంను కోరారు. ఆగిన పనులతో మురుగు నిలిచిపోయి దుర్వాసన ప్రబలుతోందన్నారు. కాలనీలోని ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

'డంపింగ్ యార్డును మరో చోటకు తరలించండి'

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ 7వ వార్డు పరిధిలోని అంబికానగర్ కాలనీ సమీపంలో డంప్ చేస్తున్న చెత్తను వెంటనే తొలగించాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు స్థానిక కౌన్సిలర్ దండెం కృష్ణారెడ్డితో కలిసి శుక్రవారం కమిషనర్ రవీందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. గత కొన్ని రోజులుగా వార్డుల్లో సేకరించిన చెత్తను కాలనీ సమీపంలోని ఈదుల చెరువు పక్కన డంప్ చేస్తున్నారని డంపింగ్ యార్డుపై పందులు స్వైరవిహారం చేస్తున్నాయని, దుర్వాసన, దోమల బెడద ఎక్కువైందన్నారు. వెంటనే అక్కడ చెత్త డంప్‌ను ఆపివేసి మరోచోటకు తరలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకటరాములు, వెంకటేష్, అంబేద్కర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా గోవుల తరలింపు



బీజేపీ నేతలు పట్టుకున్న గోవుల డీసీఎం

ఏపీ నుంచి హైదరాబాద్‌కు డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న గోవులను హయత్‌నగర్ బీజేపీ నేతలు పెద్దఅంబర్‌పేట్ ఔటర్ రింగురోడ్డు వద్ద పట్టుకున్నారు. సమాచారం తెలుసుకున్న హయత్‌నగర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి గోవిందచారి, శ్రీధర్‌రెడ్డి, ఎర్ర ప్రేమ్ ఔటర్ రింగు రోడ్డు వద్దకు చేరుకుని గోవుల డీసీఎంను అడ్డుకున్నారు. అందులో 25 గోవులు, లేగదూడలు ఉన్నట్లు తెలిపారు. గోవుల డీసీఎంతో పాటు డ్రైవర్‌ను అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు అప్పగించారు.

బైరి నరేష్‌పై దాడిని ఖండించాలి

వనస్థలిపురం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మూఢనమ్మకాల నిర్మూలన సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన విజయ్ దివాస్ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అయ్యప్ప స్వామి మాలలో ఉన్న అమాయక భక్తులను రెచ్చగొట్టి బైరి నరేష్‌పై ఈనెల 1న చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మూఢనమ్మకాల నిర్మూలన సంఘం ఏపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి, కాకినాడ జిల్లా అధ్యక్షురాలు కొండేటి గౌతమి తెలిపారు. శుక్రవారం వనస్థలిపురంలో ఆమె మాట్లాడుతూ.. బైరి నరేష్‌పై జరిగిన దాడిని మేధావులు, విద్యావంతులు ఖండించాలని గౌతమి కోరారు.

అనుమతి ఓ చోట.. షాపు మరో చోట..!

● బాలాపూర్‌లో ఇష్టారాజ్యంగా రేషన్ షాపులు ● దూరప్రాంత వినియోగదారులకు తిప్పలు

సరూర్‌నగర్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సౌకర్యార్థం వారికి అనుకూలంగా ఉండే ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిన చౌక ధరల దుకాణములు(రేషన్ షాపులు).. ఎక్కడో దూరంగా ఏర్పాటు చేస్తుండడంతో వినియోగదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాలాపూర్ మండల కేంద్రంలోని బాలాపూర్ గ్రామంలోనే ఈ పరిస్థితి నెలకొనడం గమనార్హం! ఇప్పటికే ఇక్కడ రెండు రేషన్ షాపులు ఉండగా.. ఇటీవల కొత్తగా మరో షాపు మంజూరయింది. దానిని అంబేద్కర్ కూడలిలో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. అయితే బాలాపూర్ పరిధిలో ముస్లిం మైనారిటీలు అధికంగా నివసించే ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సిన మరో రెండు షాపులను సైతం బాలాపూర్ కేంద్రంలోనే ఏర్పాటు చేయడానికి సదరు షాపుల నిర్వాహకులు ప్రయత్నిస్తున్నారు. దీనిపై వినియోగదారులు ఆగ్రహం, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం జనాభా ప్రాతిపదికన వినియోగదారులకు అందుబాటులోనే షాపులు ఏర్పాటు చేసి వారికి నెలనెలా సరుకులు అందజేయాల్సి ఉంటుంది. బాలాపూర్‌లో మాత్రం తద్విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. అయినా సంబంధిత రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వినియోగదారుల ఆందోళన

బాలాపూర్ పరిధిలోని ముస్లిం మైనారిటీలు అధికంగా నివసించే బస్తీల్లో ఇటీవల 1079 కార్డుదారులకు ఒకటి చొప్పున రెండు కొత్త షాపులు మంజూరయ్యాయి. వాటిని ఆయా ప్రాంతాల్లోనే ఏర్పాటు చేసి, సమయానుకూలంగా తెరిచి స్థానిక వినియోగదారులకు సరుకులు సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే సదరు షాపులు దక్కించుకున్న డీలర్లు మాత్రం ఆ రెండు షాపులను కూడా బాలాపూర్ గ్రామంలోనే ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. స్థానిక హనుమాన్ దేవాలయం సమీపంలో ఇప్పటికే ఓ షాపు ఉండగా అక్కడికి వచ్చే వినియోగదారుల కారణంగా ఇక్కడ తరచుగా ట్రాఫిక్ చిక్కులు తలెత్తుతున్నాయి. కాగా తాజాగా మంజూరైన మరో కొత్త షాపును సైతం అదే ప్రాంతంలో ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అది కూడా అక్కడే ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ ఇక్కట్లు మరింత పెరిగే అవకాశముంది. మరో షాపును గ్రామంలోని ఇంకో గల్లీలో ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఈ రెండు షాపులతో కలిపి ఒక్క బాలాపూర్ గ్రామంలోనే ఐదు షాపులు ఏర్పాటు చేసినట్టవుతుంది. వినియోగదారులు ఓ చోట ఉంటే షాపులు మరో చోట ఏర్పాటు చేయడం ఎంత వరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గత కొన్నేళ్లుగా ముస్లిం బస్తీలు, కాలనీల్లోని వినియోగదారులంతా ఇక్కడి పాత షాపుల వద్దకే వచ్చి రేషన్ సరకులు తీసుకుపోతున్నారు. అది వారికి ఇబ్బందికరంగా మారింది. ఎంతో దూరం నుంచి వచ్చి సరకులు తీసుకుపోవడం తలకు మించిన భారంగా మారుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తాజాగా తమ బస్తీలకు మంజూరైన షాపులను సైతం బాలాపూర్‌లోనే ఏర్పాటు చేస్తున్నారని, దీని వల్ల తమ కష్టాలు ఎలా తీరుతాయని వారు ప్రశ్నిస్తున్నారు. సంక్రాంతిలోగా సదరు కొత్త షాపులు ప్రారంభం కానున్నందున సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించి ఎక్కడ మంజూరైన షాపులను అక్కడే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని, డీలర్ల ఒత్తిడికి తలొగ్గొద్దని వినియోగదారులు కోరుతున్నారు.



బాలాపూర్ మండలంలోని ఓ రేషన్ షాప్(ఫైల్)

తహసీల్దార్‌పై దివ్యాంగుడి ఫిర్యాదు

● జీవో నంబర్ 59లో రెగ్యులరైజ్ కోసం రూ. లక్ష 2 వేలు చెల్లించిన దివ్యాంగుడు
● సదరు స్థలంపై మరో వ్యక్తి ఇంటి నిర్మాణం..?
● ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పోలీసులకు ఫిర్యాదు



రాంబాబు క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న స్థలంలో మరో వ్యక్తి నిర్మించిన ఇల్లు

హయత్‌నగర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఓ దివ్యాంగుడు హయత్‌నగర్ తహసీల్దార్ సునిత, సీనియర్ అసిస్టెంట్ శ్వేతలపై హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాగ్ హయత్‌నగర్‌లోని వీరన్నగుట్ట ప్రభుత్వ భూమి సర్వేనంబర్ 195/1లో 60 గజాల స్థలాన్ని అందె రాంబాబు జీవో నంబర్ 59లో రెగ్యూలరైజేషన్ కోసం దరఖాస్తు పెట్టుకున్నాడు. దీంతో అధికారులు అందె రాంబాబుకు నోటీసులు ఇచ్చి ఆక్రమించిన స్థలం వద్దకు వెళ్లి విచారణ జరిపి క్రమబద్ధీకరణ కోసం రికమండ్ చేశారు. కలెక్టర్ ఆదేశం మేరకు రూ. లక్ష 2 వేలు చెల్లించాలని డిమాండ్ నోటీసులు పంపించారు. దీంతో రాంబాబు గత సంవత్సరం ఆగస్టు 9న రూ. లక్ష 2 వేలు ఎస్‌బీఐ బ్యాంకులో ప్రభుత్వ ఖాతాకు జమ చేశాడు. ఇదిలా ఉండగా సుధాకర్ వర్మ అనే వ్యక్తి సదరు 60 గజాలలో ఇంటిని నిర్మించాడు. ఇది తెలుసుకున్న రాంబాబు తాను క్రమబద్దీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న స్థలంలో మరో వ్యక్తి ఇల్లు నిర్మిస్తున్నాడని ఫిర్యాదు చేసినా రెవిన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయాడు. తనకు న్యాయం చేసి అక్రమార్కుల కొమ్ము కాస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని రాంబాబు శుక్రవారం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఫిర్యాదు చేయలేదు..

రాంబాబు తనకు ఫిర్యాదు చేయలేదని హయత్‌నగర్ తహసీల్దార్ సునిత తెలిపారు. ఐదు నెలలుగా ఇంటి నిర్మాణం చేస్తుంటే ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. సుధాకర్ పి. అంజమ్మ వద్ద కొనుగోలు చేసినట్లు డాక్యుమెంట్లు ఇచ్చారని అన్నారు. సదరు భూమి అంజమ్మకు ఎలా వచ్చిందో విచారిస్తామన్నారు. ఇద్దరి విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని వివరించారు.

న్యాయం చేయాలి..



దివ్యాంగుడైన తనకు ముఖ్యమంత్రే న్యాయం చేయాలని రాంబాబు కోరుతున్నాడు. స్థలం విడిచి వెళ్లాలని తనను భయపెడుతున్నారు. బదులుగా రూ. 10లక్షలు ఇస్తామని ఆశ పెడుతున్నారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి అన్యాయం చేయాలని చూస్తున్నారు. ఈ వ్యవహారంలో రెవిన్యూ కార్యాలయంలో పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారాయని ఆరోపించారు.

పార్కు ప్రహరీ కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

● హయత్‌నగర్ పోలీసులకు మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్‌లో పార్కు ప్రహరీ కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి హయత్‌నగర్ పోలీసులకు పిర్యాదు చేశారు. కుంట్లూర్ 19వ వార్డులోని గ్రామకంఠం, ప్రభుత్వ భూమిలోని 800 గజాల్లో మున్సిపల్ నిధులతో పార్కు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. శుక్రవారం సురభి వెంకట్‌రెడ్డి అనే వ్యక్తి మరో 25 మందిని తీసుకువచ్చి జేసీబీతో పార్కు ప్రహరీని కూల్చివేశారని పిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించిన వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

వనస్థలిపురం, జనవరి 5(ఆంధ్ర జ్యోతి): ఆటలో గెలుపు, ఓటములు ముఖ్యం కాదనీ టోర్నమెంట్ ఆడడమే ముఖ్యంగా భావించి క్రీడల్లో పాల్గొనాలని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్, రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ వైస్‌చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. బీఎన్‌రెడ్డినగర్‌లోని సుధాకర్‌రెడ్డి మెమోరియల్ అకాడమీలో ఏర్పాటు చేసిన సుధాకర్‌రెడ్డి మోమోరియల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2023 పోటీలను అడిషనల్ ఎస్పీ వెంకట్రావ్, ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ కోచ్ సుధాకర్‌రెడ్డిలతో కలిసి ఉప్పల శ్రీనివాస్ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, రవికుమార్, ఉప్పల్ రెడ్డి, కోచ్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ఇస్రో శాస్త్రవేత్త శివశంకర్ తదితరులు

విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్

మన్సూరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతిలోనే ఉందని, వారు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ప్రముఖ ఇస్రో శాస్త్రవేత్త ఇ.శివశంకర్ పేర్కొన్నారు. ఓ పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో శాస్త్రవేత్త శివశంకర్ మాట్లాడుతూ.. చంద్రయాన్-2 ప్రయోగం చాలా గొప్పదని, దాని గురించి విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు కూడా శాస్త్రవేత్తలుగా ఎదిగి నూతన ఆవిష్కరణలతో దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు.

చెస్ పోటీలలో సత్తాచాటిన బీపీడీఏవీ విద్యార్థులు

చంపాపేట, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 3, 4, 5 తేదీలలో డీఏవీ నేషనల్ స్పోర్ట్స్‌లో భాగంగా హరియాణలోని గురుగాంలో నిర్వహించిన అండర్-14 బాలికల విభాగం చెస్ పోటీల్లో కంచన్‌బాగ్ మిధానీ టౌన్‌షిప్‌లోని బీపీడీఏవీ విద్యార్థులు సత్తాచాటినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వీఎస్.ప్రశాంత్ తెలిపారు. డీఏవీ సౌత్ తరఫున చెస్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు సోమిలి మన్నా, హాసిక, రిధిమ, తన్వి టీమ్ రజత పతకం సాధించినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గౌరీ శంకర్ రావు, డీఏవీ పాఠశాల ఏఆర్‌ఓ వసంత ఎస్ రామన్, ప్రిన్సిపాల్ వీఎస్ ప్రశాంత్, ఎల్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

గంగుల అరుణారెడ్డికి నివాళి

ఎల్బీనగర్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు మాజీ సభ్యురాలు గంగుల అరుణారెడ్డి ప్రథమ వర్ధంతి సభ అల్కాపురి చౌరస్తా సమీపంలోని స్వాగత్ గ్రాండ్‌లో జరిగింది. పలువురు ప్రముఖులు పాల్గొని అరుణారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి, మహాత్మాగాంధీ లా కాలేజి కార్యదర్శి గంగుల గోవర్ధన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, డాక్టర్ గంగుల నవ్యరెడ్డి, ఆర్‌కేపురం కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, ధన్‌రాజ్‌గౌడ్, బొక్క భూపాల్‌రెడ్డి, శ్రీకాంత్, ప్రవీణ్‌రెడ్డి, మైనారిటీ నాయకుడు అఫ్జల్, సైదులు, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సామవేద పారాయణ మహాయజ్ఞము

చాదర్‌ఘాట్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని శ్రీమద్దయానంద వేద విద్యాలయం (గురుకులం) ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా సామవేద పారాయణ మహాయజ్ఞము శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. సుదాకర్‌గుప్తా, తాళ్లపల్లి చక్రపాణితోపాటు పలువురి పర్యవేక్షణలో మొదటి రోజైన శుక్రవారం యజ్ఞముతోపాటు ధ్వజారోహణం కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. అఖిల భారతీయ వైదిక గురుకుల పోటీలు ప్రారంభమయ్యాయి.శనివారం ఉదయం 51 యజ్ఞగుండములతో సామవేద పారాయణ యజ్ఞము నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్‌లోని సదాశివ హెవెన్స్‌లో శుక్రవారం అయోధ్య రామయ్య అక్షింతలను గడప గడపకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ప్రధానకార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌రావు, గోపాల్‌రెడ్డి, చెరుకూరి జగన్, సుదాకర్, సౌండ్ శ్రీను, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో ఉత్సాహంతో పనిచేయాలి

● ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ఎల్బీనగర్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం ముఖ్యకార్యకర్తల సమావేశం తెలంగాణ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్ల ముఖ్య కార్యకర్తలకు లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశ, నిర్దేశం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి విజయాన్ని అందించారని, అదే ఉత్సాహంతో లోక్‌సభ ఎన్నికల్లోనూ పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు మురుకుంట్ల అరవిందశర్మ, బేర బాలకిషన్, ఆర్‌కేపురం బీఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నియోజకవర్గం మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునితారెడ్డి, కొండ్ర శ్రీనివాస్, న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్, శైలజారెడ్డి, లోకసాని కొండల్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కంచర్ల శేఖర్, పెంబర్తి శ్రీనివాస్, సాజిద్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.



సబితాతో ఆర్‌కేపురం, సరూర్‌నగర్ నాయకులు, కార్యకర్తలు

పర్సనలైజ్డ్ ఔషధాలను అందించడం కీలకం

● ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఆస్పత్రి పర్సనలైజ్డ్ మెడిసిన్ ప్రామాణిక అభ్యాసంగా మారాలని, అందరికీ కచ్చితమైన, సమర్థవంతమైన, సరసమైన పర్సనలైజ్డ్ ఔషధాలను అందించడం అనేది కీలకమని ఏఐజీ ఆస్పత్రి చైర్మన్, గ్యాస్ట్రోఎంటరాలజీ చీఫ్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లో ఉప్పలూరి-హెచ్ పర్సనలైజ్డ్ మెడిసిన్ క్లినిక్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన 'జెనీకనెక్ట్ ఆర్ఎక్స్'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్సనలైజ్డ్ మెడిసిన్‌పై పరిశోధనలు జరగాలన్నారు. డాక్టర్ వినయేందర్ తుల్లా మాట్లాడుతూ జెనీకనెక్ట్ ఆర్ఎ 'జెనీకనెక్ట్ ఆర్ఎక్స్' జన్యు సమాచారాన్ని డీకోడ్ చేయడం ద్వారా డ్రగ్ డిస్కవరీలో విప్లవాత్మక మార్పులు చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు కళ్యాణ్ ఉప్పలూరి, హిమ చల్లా, ఏఐజీ ఆస్పత్రుల వైస్ చైర్మన్ పెన్మెత్స వెంకటసుబ్బరాజు, సీఎస్ఐఆర్ విశిష్ట శాస్త్రవేత్త, మాజీ డైరెక్టర్, సెంటర్ ఫర్ సెల్యులార్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) ప్రొఫెసర్ సీహెచ్ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డితో వైద్యులు

పత్రికలు-రాజకీయాల మధ్య బంధాలు మారాయి



మాట్లాడుతన్న బుద్ధ మురళి, చిత్రంలో కళా జనార్దనమూర్తి తదితరులు

చిక్కడపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గతంలో పత్రికలు, రాజకీయాలకు మధ్య సంబంధాలు సామాజిక, దేశ ప్రయోజనాల కోసం ఉండేవని, నేడు ఆర్థిక అవసరాల కోసంగా మార్పు చెందిందని రాష్ట్ర సమాచార హక్కుచట్టం మాజీ చీఫ్ కమిషనర్ బుద్ధ మురళి అన్నారు. షోయబుల్లాఖాన్ పత్రికా రచయితగా నైజాం అరాచకానికి వ్యతిరేకంగా పోరాడి రజాకార్ల ఆగ్రహానికి గురై హత్యకు గురయ్యారన్నారు. త్యాగరాయగానసభలో దశాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా షోయబుల్లాఖాన్ సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధ మురళి మాట్లాడుతూ.. గతంలో గాంధీ, నేతాజీ ప్రకాశంపంతులు వంటి ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు పాత్రికేయ రంగంలో ఉన్నారన్నారు. షోయబుల్లాఖాన్ పత్రికను నడిపి నైజాం నిరంకుశ పాలనను విమర్శిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించారని వివరించారు. జర్నలిస్ట్ జయసూర్య మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలో పుట్టిన షోయబుల్లాఖాన్ ఓయూలో ఉన్నత విద్య చదివి నైజాంను ధిక్కరించారని వివరించారు. 28 ఏళ్ల అతి చిన్న వయస్సులోనే రజాకార్ల చేతిలో హత్యకు గురవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాసేవకుడు వైకుంఠం, గానసభ పాలకవర్గ కమిటీ సభ్యులు బండి శ్రీనివాస్ ద్రావిడ పాల్గొన్నారు.

తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడిగా చేగూరి వెంకటరమణ

చాదర్‌ఘాట్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ నూతన అధ్యక్షుడిగా చేగూరి వెంకటరమణ శుక్రవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మలక్‌పేటలోని కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ.. వ్యాపారుల సంక్షేమం కోసం ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు.

జేఎన్‌టీయూ పీజీ హాస్టళ్లకు ముగ్గురు వార్డెన్లు

హైదరాబాద్ సిటీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలోని లేడీస్ పీజీ హాస్టళ్లకు ముగ్గురు వార్డెన్లను నియమిస్తూ ప్రిన్సిపాల్ విజయకుమార్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పీజీ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పలువురు విద్యార్థినులు గురువారం జేఎన్‌టీయూ ప్రధాన గేటు వద్ద బైఠాయించి ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒకరిని రెగ్యులర్ వార్డెన్‌గా, ఇద్దరిని అసోసియేట్ వార్డెన్లుగా నియమించారు. వీరితో పాటు డిసిప్లిన్ అండ్ మెయిటెనెన్స్ కోఆర్డినేటర్లుగా ఐదుగురు కాంట్రాక్టు అధ్యాపకులను నియమించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ముదిరాజ్ ఆత్మగౌరవ భవన పనులు ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్‌లో రూ. 10 లక్షలతో చేపట్టిన ముదిరాజ్ ఆత్మ గౌరవ భవన స్లాబ్ పనులను శుక్రవారం సర్పంచ్ చెరుకు కిరణ్‌కుమార్‌గౌడ్ ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మంజూరీ చేసిన నిధులతో పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. భవన నిర్మాణం పూర్తిచేసే వరకు తన సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు సంతోష్, మహేందర్‌తో పాటు ముదిరాజ్ సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఉచితంగా యోగా తరగతులు

హైదరాబాద్ సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో యోగా తరగతులను వసంత యోగా అకాడమీ నిర్వహిస్తోంది. 18 ఏళ్ల దాటిన వారికి తరగతులను ఉచితంగా అందించనున్నట్లు వసంత యోగా ట్రస్ట్ ఒక ప్రకటనలో తెలిపింది.

ఈనెల 7 నుంచి ప్రతి ఆదివారం ఉదయం 6.30 గంటలకు క్లాస్‌లు జరుగుతాయని, వివరాలకు 9989703034 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని నిర్వాహకులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | రాజు : 99854 02786